## యాదాద్రి అడిషనల్ కలెక్టర్‌గా భాస్కర్ రావు



యాదాద్రి భువనగిరి, మే 31 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా భాస్కర్ రావు నియమితులయ్యారు. ఈమేరకు సీఎస్ రామకృష్ణారావు జీవో 717 జారీ చేశారు. ఇటీవల వరకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈవోగా పనిచేసిన ఆయన..పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. గతంలోనూ యాదాద్రి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేసిన ఆయనకు జిల్లాపై మంచి పట్టుంది. జిల్లాలో ఇప్పటి దాకా మూడు నెలలుగా అడిషనల్ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. అప్పటివరకు ఏసీఎల్‌బీగా పనిచేసిన గంగాధర్.. మార్చి 13 బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

## డిగ్రీ పరీక్షల్లో 40 మంది విద్యార్థుల డిబార్

రామగిరి, మే 31: ఎంజీ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలో భాగంగా శనివారం జరిగిన 2వ సెమిస్టర్, 5వ సెమిస్టర్ పరీక్షలో 40మంది మాల్‌ప్రాక్టిస్‌కు పాల్పడుతుండగా స్క్వాడ్ బృందాలు డిబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. 2వ సెమిస్టర్ పరీక్షకు 8,188 మంది హాజరుకావాల్సి ఉండగా 7,145 మంది హాజరు కాగా, 946మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలో 27మంది డిబారయ్యారు. రామన్నపేట ప్రభుత్వ కళాశాలలో 2, శ్రీ హిందూలో 1, భువనగిరి జాగృతిలో 1, ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్‌లో 1, నల్లగొండ కాకకాతీయలో 2, సిద్ధార్థలో 1, డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 1, మాల్‌లోని శ్రీవేంకటేశ్వరలో 6, మిర్యాలగూడ హసితలో 1, సూర్యాపేటలో రాకేశ్ బీఈడీ కళాశాలలో7, దేవరకొండలోని భవితలో నలుగురు డిబారయ్యారు. 5వ సెమిస్టర్ పరీక్షలకు 2,582 మంది హాజరుకావాల్సి ఉండగా 2,233మంది హాజరుకాగా 336 గైర్హాజరైన్నారు. ఈ పరీక్షలో 13 మంది డిబార్‌కాగా నల్లగొండ సిద్ధార్థలో 2, చౌటుప్పల్ మాతృశ్రీలో 1, హుజూర్‌నగర్‌లోని ప్రియదర్శిలో 1, సూర్యాపేటలోని సిద్ధార్థలో 1, స్పందనలో 1, రాకేశ్‌లో 1, భువనగిరి స్టాన్‌ఫర్‌లో 3, కోదాడలోని త్రివేణిలో 1, మిర్యాలగూడ హసితలో 1, విజేతలో 1 ఉన్నారు.



## తెలంగాణ రాష్ట్ర సంబురాలకు రెడీ

- అమరుల త్యాగఫలం • సబ్బండ వర్గాల కృషి
- స్వరాష్ట్ర కల సాకారం • ఘనంగా నిర్వహించాలి
- పార్టీ శ్రేణులకు బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ పిలుపు



నల్లగొండ/చందంపేట(దేవరకొండ), మే 31: నల్లగొండ జిల్లావ్యాప్తంగా సోమవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ..అలుపెరగని పోరాటంతో, ఉద్యమ రథసారథి కేసీఆర్ సారథ్యంలో సాధించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గ కేంద్రాల్లో, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాల కేంద్రాల్లో జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఎగురవేసి, పెద్దఎత్తున సంబురాలు నిర్వహించాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు, శ్రేణులంతా పాల్గొనాలని, ప్రజలతో కలిసి సోమవారం అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల సమిష్టి కృషితోనే ఆరు దశాబ్దాల కల సాకారం అయిందని ఆయన గుర్తు చేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ తొలి పదేండ్ల ప్రస్థానం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని రమావత్ రవీంద్ర కుమార్ తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రతి ఆలోచన అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర సర్కార్‌కు కూడా దిక్సూచిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై పురుడు పోసుకున్న రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశానికే దారి చూపే దీపస్తంభంలా నిలవడం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని ఆయన స్పష్టం చేశారు.



## అమరుల త్యాగాలను స్మరించుకుందాం..

- రాష్ట్ర సాధనకు కేసీఆర్ సుదీర్ఘ పోరాటం
- చావు నోట్లో తలపెట్టి రాష్ట్రం సాధించారు..
- త్యాగాలను గుర్తు చేసుకుందాం..
- ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, మే 31: జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆలేరులోని పాలశీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నో పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి గ్రామంలో జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేస్తూ ఘనంగా నివాళులర్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర సాధనకు సుదీర్ఘ పోరాటం చేశారని, చావు నోట్లో తలపెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. ఆంధ్ర పాలకులతో నష్టపోయిన తెలంగాణ పదేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు,తాగునీరు అందించిన పితామహుడు కేసీఆర్ అని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఎలా అయితే సంబురాలు జరుపుకున్నామో, అదేమాదిరిగా సోమవారం జాతీయ పతాకాన్ని ఎగురవేసి సంబురాలు జరుపుకోవాలన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. కార్యక్రమంలో గుట్ట మండలాధ్యక్షుడు వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, ఆలేరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, నాగరాజు, రాంరెడ్డి, హరినాథ్, పాండరి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, కిష్టయ్య, నర్సింహులు, నరసయ్య, ఉప్పలయ్య, సంపత్, ఫయాజ్, కృష్ణ, పాల్గొన్నారు.



## రూ.2వేలు కొట్టు.. రేషన్‌కార్డు పట్టు!



- అర్హులైన అమాయకులే లక్ష్యంగా
- ఓ మహిళా అధికారి చేతివాటం
- కట్టంగూర్ తహసీల్దార్ ఆఫీసులో వసూళ్లు

సామాన్య ప్రజలు తాసీల్దార్ కార్యాలయం మెట్లు ఎక్కాలంటేనే వణికిపోతున్నారు. ఏ పనికైనా పచ్చనోటు చూపితేనే పని చేసే పరిస్థితి దాపురించడంతో బలహీన వర్గాలు, రైతులు కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నా పనులు కావడం లేదనే దుస్థితి నెలకొన్నది. దీంతో దళారుల మధ్యవర్తిత్వంతో ముడుపులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని ప్రజలు వాపోతున్నారు.

కట్టంగూర్, మే 31: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు లేనివారికి కొత్తవి మంజూరు చేస్తామని ప్రకటించడంతో రేషన్‌కార్డుల మంజూరు కట్టంగూర్ తాసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వరంగా మారింది. రేషన్‌కార్డుల జారీలో అర్హులైన అమాయకుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది. స్థానికంగా వినిపిస్తున్న ఫిర్యాదుల మేరకు.. రేషన్‌కార్డు ఇప్పిస్తా.. రూ.వెయ్యి నుంచి రూ.2వేలు కొట్టు.. అంటూ ఓ మహిళా అధికారితో పాటు మరికొందరు అధికారులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారిని ఆసరాగా చేసుకుని కార్యాలయ సిబ్బంది లంచాలు వసూలు చేస్తున్నట్లు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారడంతో స్థానిక ప్రజలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేయడంతోపాటు అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఓ మహిళా అధికారి చేతివాటం..

ఓ మేజర్ గ్రామపంచాయతీతోపాటు మరో రెండు గ్రామాల రేషన్‌కార్డుల దరఖాస్తులను ధ్రువీకరించే ఓ మహిళా అధికారి రూ.వెయ్యి నుంచి రూ.2వేలు వసూలు చేస్తుందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సదరు అధికారి డబ్బులు నేరుగా తీసుకోకుండా కుటుంబ సభ్యులు లేదా మధ్యవర్తులకు ఫోన్‌పే ద్వారా పంపించమంటున్నదని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకున్నట్లు ఎవరికైనా చెబితే రేషన్‌కార్డు రాదని తెగేసి చెబుతుందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు అనేది ప్రహసనంలా కొనసాగుతున్నది. నత్తే సిగ్గు పడేంతగా కొనుగోళ్ల వ్యవహారం నడుస్తున్నది. వాన కాలం సీజన్ ప్రారంభమైనా.. యాసంగిలో పండిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. సర్కారు అలక్ష్యం.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం వర్షంలో తడిసింది. ధాన్యమంతా తడిసింది. ధాన్యం మొలకెత్తి ఐకేపీ కేంద్రాలన్నీ నారుమళ్లను తలపిస్తున్నాయి. వందలాది మంది రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో 286 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా ఇంకా 116 కేంద్రాల్లో ధాన్యం ఉంది.

## కల్లాల్లో ధాన్యం.. కండ్లల్లో దైన్యం

### ఆగుతూ.. సాగుతూ.. కొనుగోళ్లు



- ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం
- నారుమళ్లుగా ఐకేపీ సెంటర్లు
- మొలకెత్తిన ధాన్యాన్ని కొనని అధికారులు
- తెరిచి ఉన్న 116 కొనుగోలు కేంద్రాలు



సూర్యాపేట, మే 31 (నమస్తే తెలంగాణ) : ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో కర్షకులు కష్టాలు పడుతున్నారు. రైతులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడం లేదు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ చేపట్టిన పథకాలను కూడా కొనసాగించడం లేదు. రైతు భరోసా ఎగ్గొట్టడం... రుణమాఫీ చేయకపోవడం... నిర్వహణ లోపంతో సూర్యాపేట జిల్లాకు కాళేశ్వరం నీళ్లు బంద్ కావడంతో పెద్దఎత్తున పంటలు ఎండిపోయిన విషయం తెలిసిందే. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అనేక రకాలుగా నష్టపోతూ గత ఉమ్మడి రాష్ట్రంలోని కష్టాలు పునరావృతం అవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే యాసంగి సీజన్ కోతలు పూర్తయి రెండు నెలలు గడిచినా ప్రభుత్వ నిర్వాకమో... అధికారుల నిర్లక్ష్యమో కానీ ఇంకా 116 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతుల పంట ఉంది. ప్రధానంగా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోనే సెంటర్లు తెరిచే ఉన్నాయి.

### కొనుగోళ్ల ఆలస్యంతో మొలకలెతుత్తుంది

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో కొద్ది రోజులుగా వర్షాలు కురిసి కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసి మొలకలెత్తి నారుమళ్లుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో 4,73,739 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా మార్చి మొదటి వారంలోనే పంట చేతికి వచ్చింది. కానీ కొనుగోలు కేంద్రాలను మాత్రం ఆలస్యంగా ప్రారంభించారు. రైతులు పండించిన పంట దాదాపు 50శాతం తమ ధాన్యాన్ని ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయించుకున్న తరువాత దాదాపు నెల రోజుల ఆలస్యంగా అంటే ఏప్రిల్ 12న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. జిల్లాలో 286 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారుల అంచనాలు ఉండగా ఇప్పటి వరకు సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం గమనార్హం. ఇప్పటికే ఇంకా 116 కొనుగోలు కేంద్రాలలో దాదాపు 15వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారుల అంచనాలు ఉన్నాయి. చాలాచోట్ల రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రెండునెలలు గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో నానా ఇబ్బందులకు గురౌతున్నారు. ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ ధాన్యం రాసులకు కాపలా ఉంటున్నారు. గత్యంతరం కొనుగోలు కేంద్రాలకు తీసుకుపోయిన వేలాది మంది రైతులు తమ ధాన్యాన్ని ఎత్తుకొని ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయించుకున్నారు. చేతికి వచ్చిన పంటను అమ్ముకుందామన్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరి కొనుగోలు చేయకపోవడంపై రైతులు ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి జిల్లా సప్లై అధికారి శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా వర్షాల కారణంగా కాస్త ఆలస్యం అవుతుందని, మరో రెండుమూడు రోజుల్లో కొనుగోళ్లన్నీ పూర్తి చేసి సెంటర్లన్నింటినీ మూసి వేస్తామన్నారు.




## • పంతంగి టోల్‌గేటు వద్ద ట్రాఫిక్ జామ్



చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌గేట్ వద్ద శనివారం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. టోల్‌ప్లాజాలో సాంకేతిక కారణలతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. దీనికితోడు శనివారం వీకెండ్, శుభకార్యాలు ఉండటంతో ఈ సమస్య నెలకొన్నదని చెబుతున్నారు. విజయవాడ వైపు వెళ్లే వాహనాలు భారీగా నిలిచి పోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు అర గంటకుపైగా వేచి చూడాల్సి వచ్చింది. ట్రాఫిక్ పెరగడంతో టోల్ సిబ్బంది వాహనాల నంబర్లు నోటు చేసుకొని వదిలారు. ఆయా నంబర్ల ఆధారంగా నగదును వసూలు చేయనున్నట్లు సమాచారం. – చౌటుప్పల్, మే 31

## • బోనమెత్తిన తేలకంటిగూడెం



నల్లగొండ జిల్లా కనగల్ మండలం తేలకంటిగూడెంలో కంఠమహేశ్వరస్వామి సురమాంబదేవి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల సందర్భంగా శనివారం గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఆలయంలో పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ, మే 31

